# గంధం

యూనివర్సిటీ ఫస్ట్ వచ్చి నందుకు నన్ను అభినందించటానికి నా మిత్రులంతా కల్సి ఒక సభ ఏర్పాటు చేసేరు.

సభ ఆరంభమయిన కొద్దిసేపటికే ఓ మూల ఏదో గొడవ ఆరంభమయింది.

సెంద్రి ఒక కుర్రవాడిని బూతులు తిడ్తూ అతడి మీదికెళ్లి కలబడ్తున్నది.

నలుగురూ వచ్చి ఆ కుర్రాడిని ఆమె బారి నుంచి రక్షించి బయటకు పంపించి వేసేరు. సెంద్రి శాంతించి వెళ్లి ఓ మూలగా నక్కి కూర్చుంది.

యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు ఇళ్ల నుంచి భోజనం కేరియర్లు పట్టుకొచ్చి ఇస్తుంది సెంద్రి. వారు నెలకింతని ఇచ్చే డబ్బే ఆమెకు జీవనాధారం.

కానీ ఆమె తన పని తను ముగించుకొని అందరిలా ఇంటికెళ్ళదు. పనున్నా లేకపోయినా యూనివర్సిటీ కేంపస్‌లోనే కాలం గడుపుతుంది.

యూనివర్సిటీలో ఏ ఫంక్షన్ జరిగినా ఆమె తప్పనిసరిగా హాజరవుతుంది. అందుకని ఆమె మీద కొందరు విద్యార్థులు జోక్స్ విసురుతుంటారు.

ఆమె శరీరం నల్లగా మెరుస్తుంటుంది. చినిగిన బట్టలు, చింపిరి తల ఆమె ఆభరణాలు. పద్దెనిమిదేళ్ల ఆమె యవ్వనపు వంపుసొంపుల్ని దాచలేక ఆ ఆభరణాలు నానా అవస్థలు పడ్తుంటాయి. అసలామె తన యవ్వనపు బిగుతుల్ని దాచుకొనే ప్రయత్నమే చేస్తున్నట్లు కన్పించదు. ఎప్పుడూ ఎక్కడో ఏమిటో ఆలోచిస్తున్నట్లు చెట్లు గుట్టల వెంట తిరుగుతుంటుంది.

విద్యార్థుల్లో కొంతమందికి ఆమె బీదరికం కన్పించదు. బీదరికంవల్ల దాచుకోలేని ఆమె యవ్వనపు వంపుసొంపుల్ని లొట్టలేస్తూ చూస్తుంటారు. కొందరు హీరోలు ఆమె యవ్వనాన్ని జుర్రుకుందామని నాలుగడుగులు ముందుకేసేరు.

అలాంటి సమయాల్లో ఆమె నోటినుంచి బూతుల వర్షం కురుస్తుంది. తొడ చరిచి ముందుకు దూకే పహిల్వాన్‌లా మారి యుద్ధానికి దిగి ముందు తనే తంతుంది.

అలా ఆమెచేత బూతులు తిట్టించుకొన్నవాళ్లు, తన్నులు తిన్నవాళ్లు ఆమెకు నిక్‌నేమ్స్ పెట్టి, జోక్స్ వేసుకొని తృప్తి పడ్తుంటారు.

'ఒరేయ్ దాని దగ్గరికెళ్లేవురోయ్ - కంపు'

'అది సౌగంధిరా భాయ్'

సభ మళ్లీ ఆరంభమయింది. విద్యార్థులంతా నన్ను ఇంద్రుడు చంద్రుడు అంటూ పొగిడేరు.

''నాయనా రామచంద్రం. ఒక్క దీపంతో వేల దీపాలను వెలిగించవచ్చు. నీ చదువును ఒక్క దీపాన్ని వెలిగించటానికి ఉపయోగించు. చదువురాని వ్యక్తికి ఒక్కరికి చదువు చెప్పు. అప్పుడు నీ చదువు సార్థకమవుతుంది. ఎప్పుడూ ఐశ్వర్యపు మెరుపులవైపు మాత్రమే చూడకు నాయనా. చీకటి బతుకుల్లోకి కూడా నీ విజ్ఞానలోచనాలను ప్రసరింపచేయి. నిజమైన మనిషినని నిరూపించుకో''

ప్రొఫెసర్ రావు గారు క్లాసులో తప్ప బయట ఎప్పుడూ ఇన్ని మాటలు మాట్లాడటం ఎవరూ వినలేదింతవరకూ. ఆయన మాటల మనిషి కాదు. చేతల మనిషి. తన పనుల ద్వారా ఇతరులకు మార్గదర్శనం చేస్తుంటారు.

ఆయన మాటలు నన్ను కదిలించాయి. ఆ ప్రేరణతో ఆ రోజు నేను కూడా అద్భుతంగా మాట్లాడేను. సభ అయిపోయి నేను బయటికి వస్తుండగా-

''ఒరేయ్ సౌగంధి వస్తున్నదిరోయ్. కంపు, దుర్గంధం. పారిపోండిరా బాబూ.... పారిపోండి'' కేకవేసేరు కొందరు.

సెంద్రి నా ఎదుటికొచ్చి ఒక్క క్షణం నన్నే చూస్తూ నిల్చుంది. ఆమె నల్లటి మొహంలో తెల్లటి వెలుగు, కళ్లల్లో మెరుపులు.

''కంపు సుందరి రామచంద్రంగాడిని లవ్వాడ్తున్నట్లుందిరోయ్. వహ్వా... ఏం పోజు... శ్రీదేవి పోజు''

ఆమె చటుక్కున నా బుగ్గను ముద్దు పెట్టుకొంది. ఆ సన్నివేశాన్ని అందరూ చూశారు.

కానీ ముద్దు పెట్టుకొంటుండగా ఆమె కళ్లల్లో నుంచి ఒక్క కన్నీటి బిందువు నా బుగ్గపైకి జారింది.

అది నా ఒక్కడికి మాత్రమే తెల్సు!

★——★——★

''బావా! ఐ లవ్యూ బావా! ఐ వాంట్ యు... అయ్ వాంట్ యు ఇమ్మీడియట్లీ'' స్వప్న నన్ను గాఢంగా కౌగిలించుకొంది.

ఆమె శరీరం నుంచి వస్తున్న వివిధ రకాలైన పరిమళాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేయి. ఆమె కౌగిలి ఇనుప కట్టడంలాగా వుంది.

''ఈ చొరవ చదువు విషయంలో చూపితే ఎంతో బాగుంటుంది స్వప్నా''

చదువు అంటే స్వప్నకు కోపం వస్తుంది. కౌగిలి వదిలింది.

''నేను లవ్వంటే నువ్వు చదువంటావేమిటి బావా? చదువుకొన్నావన్న పేరే కాని నీకు మోడ్రన్ టేస్ట్స్ తెలీవు. ఒట్టి పల్లెటూరి బైతులా కన్పిస్తావు''

''పోనీయ్‌లేకాని ఇంటర్ పాసయ్యావా?''

''నేను కాను. వెధవ ఇంటర్... అదంటే నాకు ఒళ్లుమంట. ఏం? ఇంటర్ పాసయితే కానీ నన్ను లవ్ చేయవా? పెళ్లి చేసుకోవా?''

''అలాగని కాదు. కానీ ఇంటర్ అన్నా పాస్‌కాకపోతే అంతా ఏమనుకొంటారు?''

''ఏమనుకొంటారు? అయినా ఎవరో ఏమో అనుకొంటారని నేను దేనికీ భయపడను బావా. నాకు డబ్బుంది. అందం వుంది. ఆ రెంటితో నేను ప్రపంచాన్ని శాసించగలను. తెల్సా?''

''కానీ అన్ని భూషణాలలోకి విద్యా భూషణం గొప్పది స్వప్నా. నా చదువు అయిపోయిందిగదా? ఉద్యోగం దొరికిందాకా ఇక్కడే వుంటాను. కావాలంటే నీకు చదువు చెప్తాను. ఇంటర్ ఏమిటి? డిగ్రీ కూడా పాస్ అవుతావు నువ్వు''

''నీ దగ్గర చదువు నేర్చుకొంటాను బావా. కానీ ఇంటర్ చదువు కాదు. ఆడామగా జంట చదువు. నేర్పవూ? ఇప్పుడే పాఠాలు మొదలు పెట్టు బావా?''

స్వప్న తండ్రి నాకు వరసకు మేనమామ అవుతాడు.

కానీ మాది మధ్య తరగతి కుటుంబం. ఆయనది సంపన్న కుటుంబం. శ్రీపతి మామయ్యదెప్పుడూ పై చూపే. కానీ నన్ను అల్లుడుగా చేసుకోటం కోసం ఇప్పుడు కింది చూపు చూస్తున్నాడు.

''అల్లుడూ యూనివర్సిటీ ఫస్ట్ వచ్చావుట కదా? పేపర్లో ఆ వార్త చూసి నేను ఎంత గర్వించానో తెల్సా? నా అల్లుడు ఇంత గొప్పవాడని ఇండియాలో నాకు తెల్సిన పెద్ద పెద్దవాళ్లకి ఫోనులు చేసి మరీ చెప్పాను. వాళ్ల సలహాపై విదేశాల్లో వారిక్కూడా చెప్పేను. ఇప్పుడు నీ ఖ్యాతి ఖండాంతరాలకి పాకిపోయిందయ్యా. ఇంకేం? చదువు అయిపోయిందిగదా? పెళ్లెప్పుడు చేసుకొంటావో చెప్పు. నీదే ఆలస్యం. స్వప్న నీ కోసం ఒకటే కలవరిస్తున్నదనుకో''

''ఇంకా మార్కుల లిస్టన్నా తీసుకోలేదు మామయ్య. కాన్వొకేషన్ కావాలి. గోల్డ్ మెడల్ తీసుకోవాలి. ఉద్యోగం రావాలి''

''అమ్మాయ్ చెల్లెమ్మా. విన్నావామ్మా! నీ కొడుక్కు ఉద్యోగం కావాలిట. అది కూడా ఎక్కడినుంచో రావాలిట''

శ్రీపతి మామయ్యకు వియ్యంకుడు కావటం నాన్నకు అంత ఇష్టం లేదు. కానీ అమ్మ ఎప్పుడెప్పుడు వాళ్లకు వియ్యపురాలు కావాలా అని తొందరపడ్తున్నది. ఆమె దృష్టిలో శ్రీపతి గొప్పవాడు. మరి అలాంటి గొప్పవాడితో వియ్యమందటం సామాన్య విషయమా?

''అదేమిట్రా? శ్రీపతి మామయ్య వుండగా నీకు ఉద్యోగానికేం కొరత? క్షణంలో వస్తుంది''

''వస్తుంది కాదమ్మా. వచ్చింది. ఈ క్షణంలో నా కంపెనీకి అతడిని జనరల్ మేనేజర్‌ని చేస్తాను. స్వప్న మెళ్లో తాళి కట్టమను''

''స్వప్నను చదవనివ్వండి మామయ్యా. కనీసం డిగ్రీ అన్నా సంపాదించుకోనివ్వండి.

ఇప్పుడు మా పెళ్లికి తొందరేముంది?''

''బావా. చదువు చదువు అని మాటి మాటికి నన్ను ఇన్‌సల్ట్ చేస్తే నాకు కోపం వస్తుంది. నేను చదవననుకొన్నావా? ఆ మాటకొస్తే నేను చదివినన్ని పుస్తకాలు నువ్వు కూడా చదివి వుండవు''

''అవునయ్యా అల్లుడూ. అమ్మాయి ఎప్పుడూ చదువుతూనే వుంటుంది. తెలుగు పుస్తకాలే కాదు. ఇంగ్లీషు పుస్తకాలు కూడా. కావాలంటే మా ఇంటికి రా. చూపిస్తాను. దాని గదినిండా పుస్తకాలే.''

మాట అనటమే కాదు. స్వప్న పట్టుదలపైన నన్ను బలవంతంగా కారులో కుదేసి ఇంటికి తీసుకెళ్లారు.

''నేను చదివే పుస్తకాలు చూపిస్తాను రా బావా'' అంటూ నా చెయ్యి పట్టుకొని తన గదిలోకి బరబరా లాక్కెళ్లింది స్వప్న.

ఆ ఎయిర్ కండిషన్డ్ గదిలోకి ప్రవేశించగానే ఏదో కమ్మటి సుగంధం గుప్పుమంది. ఫ్రిజ్, వి.సి.ఆర్., ఫోన్‌లాంటి మోడ్రన్ స్టేటస్ సింబల్స్‌తో ఆ గది అలంకరించబడి వుంది. గోడల్లోనే అమర్చబడిన నాలుగు వరుసల్లో పుస్తకాలు నీట్‌గా సర్దివున్నాయి.

''చూడు బావా. ఇవన్నీ నేను చదివేసిన పుస్తకాలు. ఏం? వీటిని చదవడం చదువు కాదా?'' అంటూ పది పుస్తకాలను తీసి టీపాయ్ పైన గుట్టగా పోసింది.

ఆ పుస్తకాలవైపు చూసి ఉలిక్కిపడ్డాను!

''ఈ పుస్తకాలన్నీ చదివేవా నువ్వు?''

''అరగదీసి సారాన్ని జీర్ణం చేసుకొన్నాను బావా. అనుమానమైతే అక్షరం పొల్లు పోకుండా చెప్తాను. రెడీయేనా?''

''వద్దు వద్దు.... కానీ...''

''బావా. నువ్వు చదివిన చదువుల్లో సారమేముంది బావా? చప్పిడి తిండి అదంతా. నిజమైన విజ్ఞానం, థ్రిల్, సస్పెన్స్ అండ్ క్రయిమ్ నవల్స్‌లోనే వుంది బావా. జీవితంలో పనికొచ్చే చదువు నాది. తెల్సా?''

ఆమె నన్ను ఒక్కసారిగా బెడ్ మీదికి తోసేసి గట్టిగా కౌగిలించుకొంది.

ఆ గదిలో పరుచుకొన్న సుగంధం, ఆమె శరీరం విరజిమ్ముతున్న పర్‌ఫ్యూమ్ వాసనలు భరించలేనంత కంపుకొట్టేయి.

గట్టిగా ముక్కు మూసుకొని ప్రాణాయామం చేసేను!

★——★——★

నా అదృష్టం బాగుండి మర్నాడు విశాఖపట్నంలోని ఒక ప్రయివేట్ కాలేజీ వారి నుంచి పార్ట్ టైమ్ లెక్చరర్ ఉద్యోగంలో చేరమని పిలుపొచ్చింది.

నాన్నకు మాత్రమే చెప్పి వెంటనే మా ఊరి నుంచి పారిపోయొచ్చాను.

కాలేజీకి దగ్గర్లోనే ఒక సింగిల్ రూమ్ తీసుకొన్నాను. హోటల్లో భోజనం చేస్తే నాకొచ్చే జీతం, కాఫీ టిఫెన్‌లకి, రూమ్ రెంట్‌కి, భోజనానికి బొటాబొటిగా సరిపోతుంది. అంచేత స్వయం పాకం ప్రారంభించాను.

కానీ నెల తిరిగేసరికి నిజంగానే చాలా సార్లు చెయ్యి కాల్చుకొన్నాను. గదిని చిమ్మటానికి, అంట్లు తోమటానికి ఏర్పరుచుకొన్న పనిమనిషి ఆ నెలలో ఇరవై రోజులు 'ఫ్రెంచ్ లీవు' తీసుకొంది. కనుక వంట మనిషి వేషాన్ని, పనిమనిషి వేషాన్ని కూడా నేనే వేయాల్సి వచ్చింది.

అసలే నాకు వంట చెయ్యటం చేత కాదు. కనుక అనేక ప్రయోగాలు చేసి నానా బాధలు పడ్డాను.

నా బాధల్ని ఎవరికో ఒకరికి చెప్పుకోవాలి. లేకపోతే మనసు శాంతించదు.

సిగ్గువిడిచి కొలీగ్స్‌కు చెప్పుకొన్నాను.

''బ్రహ్మచారి ఉద్యోగులకు బ్రహ్మదేవుడి శాపం వుందిరా నాయనా! మేమంతా ఇలాంటి బాధల్ని అనుభవించిన వారమే. ఇప్పుడు కూడా నీ 'ఫెలో ట్రావెలర్స్' మన కాలేజీలో వున్నారు''

''నీ బాధా నివృత్తికి రెండు మార్గాలున్నాయి. ఒకటి అర్జంట్‌గా పెళ్లి చేసుకొని కాపురం సెటప్ చేయటం. రెండు హోటల్ నుంచి కేరియర్ తెప్పించుకోటం''

''రెండో మార్గం అవుతే వెంటనే సెంద్రిని సంప్రదించండి. కేరియర్లు తీసుకురావటంలో ఆరు సంవత్సరాల అనుభవం. ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...''

''సెంద్రి ఇక్కడికొచ్చిందా?''

''ఊఁ. ఝాన్సీ లక్ష్మీబాయిలా యూనివర్సిటీ పెద్దలతో వీరోచితంగా పోరాడి పోరాడి వారినొదిలేసి ఇక్కడి కొచ్చింది. ఇప్పుడు వారి సర్వీసు మన కాలేజీకే పరిమితం''

''అయితే నువ్వింకా సెంద్రిని చూడలేదా? నువ్వు క్లాస్ చెప్తుంటే నెల రోజులుగా నీ క్లాస్ కిటికీ దగ్గరే కూర్చుంటున్నది కదా?''

మర్నాడు వంటవాడి వేషంలోకి దిగబోతున్నాను.

''మాస్టారూ...''

సెంద్రి గుమ్మం ముందు తల వంచుకొని నిలబడి వుంది.

అదే చింకి తల... చినిగిన బట్టలు...

కానీ ఆమె నిలబడ్డ భంగిమ, ఆమె మొహంలో స్పష్టంగా కన్పిస్తున్న సిగ్గు...

''ఏం సెంద్రీ. ఇలా వచ్చేవేంది? యూనివర్సిటీ వదిలేసేవుటకదా? నిన్ననే తెల్సింది. నువ్వు మా కాలేజీలో వున్నట్లు నిన్నటి దాకా నాకు తెలీదు సుమా''

''క్షమించండి సార్! మీ ఎదుటికి రావటానికి సిగ్గేసింది. ఆ రోజు... ఆ రోజు... అందరి ముందు తొందరపడి ఆ పని చేసేనుకదా? నేనంటే అలగాజాతి పిల్లను. కానీ మీలాంటి

సంస్కారులు...''

గదంతా ఏదో సుగంధం వ్యాపించినట్లయింది.

ఆమె ఇంకా ఏమేమో చెప్తూనే వుంది. కానీ నాకు ఒక్క ముక్క విన్పించలేదు.

ఆ మురికి మనిషి నోటి నుంచి ఎంత స్వచ్ఛంగా మాటలొస్తున్నాయి? ఒక్క ఉచ్చారణాదోషం లేదే!

మనిషి చేయాల్సిన అనేక తపస్సుల్లో వాక్శుద్ధి కోసం వాక్‌తపస్సు చేయాలని పెద్దలన్నారు. ఎంత తపస్సు చేసి ఈ మురికి మనిషి ఇంత సంస్కారాన్ని సాధించింది?

''యూనివర్సిటీలో నేను ఎందరో పెద్దలకు కేరియర్లు మోసేను సార్. వాళ్లు మిగిల్చిన ఎంగిలి అన్నాన్ని తిన్నాను. వారి కేరియర్లు శుభ్రం చేసేను. కానీ అందుకు నేనెప్పుడూ సిగ్గుపడలేదు. ఎందుకంటే వారు విద్యామూర్తులు. వారి నీడ, నాకు లభించిన పెద్ద వరం. వారి గాలి సోకి నేను పవిత్రురాలినవుతున్నానని గర్వించేదాన్ని. నాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం ఆ విశ్వవిద్యాలయమే అనుకొన్నాను. కానీ నా ఊహ పూర్తిగా సత్యం కాదని ఆలస్యంగా తెల్సుకొన్నాను సార్. అక్కడ గురువుల్లో కొందరివి ఎంగిలి బుద్ధులు. విద్యార్థులతో అయితే నోటితో పోరాడి గెలిచాను. కానీ వీరితో ఎలా పోరాడటం? ఈ విద్యామూర్తులందరూ అధికారస్థానాల్లో వున్న గౌరవనీయులే. వయసు పండినవారే. అయినా వారి కుసంస్కారంపై తిరుగుబాటు చేసేను. ఓడిపోయి ఇక్కడి కొచ్చాను. కత్తిని కత్తితోనే ఎదుర్కోవాలి సార్. పదునైన సూదితో ఎదుర్కొని ఏం లాభం? నేను సూదిని. కానీ కత్తినయి వారినోడించాలి సార్''

ఇది కలా? భ్రమా?

''సెంద్రీ! నీ మురికి బట్టల వెనుక ఇంత జ్వాల ప్రజ్వరిల్లుతున్నదా?''

''మీలాంటి మంచి విద్యార్థులు, రావుగారి లాంటి సద్గురువులు కలిగించిన చైతన్యం వల్లే ఈ మట్టి ప్రమిద తయారయింది సార్. నేనిప్పుడు మిమ్మల్ని ఓ కోరిక కోరటానికి వచ్చాను''

''చెప్పు సెంద్రీ''

''మీరు మంచి విద్యార్థులే కాదు. నాకు నచ్చిన మంచి గురువులు కూడా. ఇంత వరకు మీలాంటి వారి నుంచి విని నేర్చుకొన్న విద్య నా జీవితానికి ఉపయోగపడ్తుంది. కానీ నల్ల ముసుగులు కప్పుకొన్న పెద్దలతో యుద్ధం చేయాలంటే డిగ్రీ విద్య కూడా అవసరం సార్. ఆ కాగితాల విద్య కూడా నాకు నేర్పరా సార్?''

గదంతా సుగంధం విరజిమ్మినట్లయింది. అది సంస్కార గంధం.

''నేర్పుతాను సౌగంధీ. నిన్ను ఎమ్మే చేస్తాను''

''కానీ ఒక్క కండిషన్ సార్. నా పేరును మార్చకూడదు, నా వేషాన్ని మార్చమనకూడదు, అసహ్యించుకోకూడదు''

"అన్ని గంధాలలోకి సంస్కారగంధం ఉత్తమోత్తమమైనది. అన్ని విద్యలసారం సంస్కారం పెంచటమే. ఆ సంస్కారం నీకున్నప్పుడు నీ వేషమేదైతేనేం? కానీ ఈ వేషంలోనే వుండాలని నీకెందుకంత పట్టుదల?"

"ఎందుకంటే ఈ మురికిబట్టలు నేనేమిటో నాకు సర్వవేళలా హెచ్చరించే ఉపకరణాలు. అంతేకాదు. తెల్లబట్టల మురికి నుంచి నన్ను రక్షించుకోటానికి ఉపయోగపడే కవచాలు. కైపెక్కిన కళ్లకు పగ్గాలు"

"ఓకే. కానీ నాదీ ఒక్క కండిషన్ వుంది మరి"

"ఏమిటి సార్?"

"నువ్వు పదునెక్కిన కత్తిలా తయారయ్యాక నా అర్ధాంగివి కావాలి"

"అంటే... మీరు నన్ను ప్రేమిస్తున్నారా సార్. లేకపోతే ఆనాడు మిమ్మల్ని ముద్దుపెట్టుకొన్నది మిమ్మల్ని ప్రేమంచి అనుకొన్నారా?"

"ఏదీ కాదు సెంద్రీ. నేను నీ సంస్కారాన్ని, నీ యుద్ధప్రీతిని, పట్టుదలను, నీ బుద్ధి కౌలతలను ప్రేమిస్తున్నాను"

ఆమె మౌనంగా కళ్లు మూసుకొంది.

మూసివున్న ఆమె కళ్లల్లోని మెరుపుల ప్రకాశాన్ని నేనొక్కడినే చూడగలను.

స్వాతి మాసపత్రిక — ఫిబ్రవరి 1993